సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 5 । అక్టోబర్ । 2023




29న యోగాసన పోటీలు

ఉత్తర కోస్తా జిల్లా స్థాయి యోగా పోటీలె ఈ నెల 29న విశాఖ ఆర్కే బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్ వేదికపై నిర్వహించనున్నారు. 8లో



యువశక్తే దేశ సంపద

భారతదేశానికి యువత అద్భుత శక్తి అని స్వామి గీతా సారనంద మహరాజ్ పేర్కొన్నారు. 8లో



రైళ్ల గమ్యం కుదింపు

కేకే లైన్‌లో ట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదించారు. 8లో

న్యూస్‌రీల్

సినీ పరిశ్రమను విశాఖ తరలిస్తే మేలు

- ప్రముఖ సినీ నటుడు మహర్షి రమణ



మాట్లాడుతున్న సినీనటుడు మహర్షి రమణ

గూడెంకొత్తవీధి: విశాఖకు సినీ పరిశ్రమను తరలిస్తే బాగుంటుందని, దీనివల్ల ఉత్తరాంధ్ర తోపాటు ఒడియా, బెంగాళీ కళాకారులకు ప్రయోజనం చేకూరుతుందని ప్రముఖ సినీ నటుడు మహర్షి రమణ అన్నారు. తాను నిర్మించనున్న సినిమాకు సంబంధించి లొకేషన్లను చూసేందుకు బుధవారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు మద్రాసులో తెలుగు సినీ పరిశ్రమ ఉన్నప్పుడు ఇక్కడ నుంచి వెళ్లిన వారు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. వాటిని తట్టుకుని నిలబడిన వారు మంచి నటులుగా నిలిచారన్నారు. ఆ పరిస్థితుల్లో ప్రతిభ ఉన్నా నటులు అవకాశాలను కోల్పోవలసి వచ్చిందన్నారు. ఇప్పుడు పరిశ్రమ హైదరాబాద్‌లో ఉండడం మూలంగా ఈ ప్రాంత కళాకారులకు నష్టం జరుగుతుందన్నారు. ఇక్కడ నుంచి వెళ్లిన వారు అక్కడ పన్నులు చెల్లిస్తున్నారన్నారు. అదే పరిశ్రమ విశాఖ వస్తే ఉత్తరాంధ్రలో ఉన్న వారికి మంచి అవకాశాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

బకాయిలు చెల్లించకుంటే చర్యలు

- వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి హెచ్చరిక



మాట్లాడుతున్న డైరెక్టర్ మురళి

సీలేరు : సీలేరు యూనియన్ బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను బాధ్యతగా చెల్లించాలని వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ మురళి సూచించారు. బ్యాంకు ద్వారా రుణాలు చెల్లించని వారి ఖాతాల లావాదేవీలను నిలిపివేయడంతో ఖాతాదారులు ఇటీవల సీలేరు బ్యాంకు మేనేజర్‌కు ఖాతాలు తెరిపించాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారణకు ఆదేశించినట్టు ఆయన తెలిపారు. దీనిలో భాగంగానే ధారకొండలో ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీలేరు బ్యాంకు ద్వారా 688 మంది రుణాలు తీసుకున్నారని రూ.13 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయన్నారు. వీటిని చెల్లించాల్సిన బాధ్యత రుణాలు పొందిన వారిపై ఉందన్నారు. నిబంధనల ప్రకారం చెల్లించకుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ రాజు, ఎంపీటీసీ మాడి రామన్న, ఎల్‌డీఎస్ మేనేజర్ రవితేజ, యూనియన్ బ్యాంకు మేనేజరు పాల్గొన్నారు.

జీసీసీ పెట్రోల్ బంక్ పరిశీలన



పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న జీసీసీ డీఎం సింహాచలం

డుంబ్రిగుడ: జీసీసీ స్థానికంగా నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను పాడేరు జీసీసీ డీఎం సింహాచలం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సౌకర్యాల కల్పనలో భాగంగా ఎయిర్ మెషీన్ అందుబాటులోకి తెస్తామన్నారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తెచ్చామన్నారు. అరకు కాఫీ స్టాల్‌ను మరింత అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. పెట్రోల్ బంక్ ఇన్‌చార్జి సూర్యారావు, జీసీసీ సూపరింటెండెంట్ దామోదరం పాల్గొన్నారు.

గంగవరం పోలీసుస్టేషన్ తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ హడహళ్లి

గంగవరం : స్థానిక పోలీసు స్టేషన్‌ను రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ హడహళ్లి బుధవారం సాయంత్రం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సీఐ, ఎస్‌ఐలతో సమీక్షించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఏఎస్పీకి పోలీసు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. అడ్డతీగల సీఐ రాంబాబు, ఎస్‌ఐ చినబాబు, ఏఎస్‌ఐలు రెడ్డి, రజాక్, సిబ్బంది పాల్గొన్నారు.



సామూహిక సీమంతంలో గర్భిణులను ఆశీర్వదిస్తున్న మంత్రి రజిని



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న మంత్రి రజిని



పౌష్టికాహార వంటకాలను పరిశీలిస్తున్న మంత్రి రజిని

జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా

- రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- కిల్లోగుడలో వైద్యశిబిరం ప్రారంభం



కిల్లోగుడ వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మి

డుంబ్రిగుడ: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు ఆరోగ్య భరోసాను ప్రభుత్వం కల్పిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మండలంలోని జైపూర్ జంక్షన్‌లోని కిల్లోగుడ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో జిల్లాలో 297 వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు 250 మంది వైద్య నిపుణులతో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. రెండు రోజుల వైద్యశిబిరాలలో 6,250 మందికి వైద్యసేవలు కల్పించామన్నారు. 440 మందిని ఉన్నత వైద్యానికి వైద్యులు రిఫర్ చేశారన్నారు.

స్థానికంగానే ఉన్నత వైద్యం

పాడేరులో రూ.500 కోట్లతో నిర్మించిన వైద్యకళాశాల పూర్తయితే 600 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో ఉన్నత వైద్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి రజిని పేర్కొన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రితో పాటు ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో వైద్య నిపుణులతో శస్త్ర చికిత్సలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. వచ్చే ఏడాది నుంచి వైద్యకళాశాల అందుబాటులోకి రానుందని, దీనివల్ల కేజీహెచ్‌కు కేసులను రిఫర్ చేసే పరిస్థితి ఉండదన్నారు. జిల్లాకు 40 వరకు 108, 104 వాహనాలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చారన్నారు. గిరిజనులంటే సీఎంకు అపారమైన ప్రేమ అని వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు.

మిషన్ కనెక్ట్ పేరిట రోడ్ల అభివృద్ధి

డోలీమోతలు లేకుండా మిషన్ కనెక్ట్ పాడేరు ద్వారా ఇప్పటికే 1500 రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి రజిని పేర్కొన్నారు. సుమారు 200 సెల్ టవర్లను నిర్మించి గిరిజన ప్రాంతానికి కమ్యూనికేషన్ వ్యవస్థను ప్రభుత్వం మెరుగుపరిచిందన్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చే రోగులకు ఉచితంగా ఆహారం, తాగునీరు పంపిణీ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.అలాగే గిరిశిఖర గ్రామాలకు చెందిన గర్భిణులకు అరకులోయలో హాస్టల్‌ను ఏర్పాటు చేసి వారి సుఖ ప్రసవాలకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను ఆమె అభినందించారు.జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి రజని పరిశీలించారు. వ్యాధిగ్రస్తులకు ఆమె చేతులమీదుగా మందులు పంపిణీ చేశారు.

పూర్తిస్థాయిలో వైద్యసేవలు: అరకు ఎమ్మెల్యే పాల్గుణ

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల వల్ల గిరిజనులకు పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. గిరిజన గ్రామాల్లో వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించి, శిబిరాలలో ఏడు రకాల వ్యాధులకు మెరుగైన వైద్యం అందించడం గిరిజనులకు వరమన్నారు. అరకు ఏరియా ఆస్పత్రిలోఇప్పటి వరకు 586 శస్త్రచికిత్సలు, 980 మంది గర్భిణులకు సుఖ ప్రసవం జరిగిందన్నారు.

చేరువలో వైద్యం: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వంటి మంచి పథకం ప్రవేశపెట్టారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల పాడేరులో ఏర్పాటుచేయడం గిరిజన ప్రాంత ప్రజలు అదృష్టంగా భావిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

పైసా ఖర్చులేకుండా ఉచిత వైద్యం: జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పైసా ఖర్చు లేకుండా ఉచిత వైద్యం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి పేద ప్రజలమంతా రుణపడి ఉంటామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను మంత్రి రజిని పరిశీలించి వంటకాలను రుచి చూశారు. అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అంతకుముందు ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్, డైరెక్టర్ రామిరెడ్డి, ఐటీడీఏ పీవో అభిషేక్, ఏఎస్పీ ధీరజ్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ,ఎంపీటీసీలు విజయ, వరహాలమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, లలితకుమారి,ఎంపీడీవో ఉషారాణి, సర్పంచ్‌లు శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే వైద్యం

గంగవరం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిటకే మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. బుధవారం జడేరు గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్పొరేట్ వైద్య సేవలు అందడం శుభపరిణామమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఏజెన్సీ ప్రజలకు వరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బేబీరత్నం, ఎంపీడీవో శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి, మోహనాపురం ఎంపీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ చోడి మల్లికార్జునదొర, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శారపు పావని, గంగవరం, పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు భావన, సాయిరతన్, కంటి వైద్యులు ఏసుపాదం, సర్పంచ్‌లు రామలక్ష్మి పాల్గొన్నారు.



వైద్యశిబిరానికి హాజరైన రోగులు



జడేరులో జగనన్న సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రూ.8.91 కోట్లతో ఆహారశుద్ధి పరిశ్రమలు

- వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో రూ.8.91 కోట్ల వ్యయంతో చిరుధాన్యాల ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపనకు శంకుస్థాపన జరిగిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో చింతపల్లి మండలంలో రూ.4.46 కోట్లు, రంపచోడవరం మండలం ఐ.పోలవరంలో రూ.4.45 కోట్లతో చిరుదాన్యాల ఆహార శుద్ధి పరిశ్రమలకు శంకుస్థాపన చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని బుధవారం కలెక్టరేట్ నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల నిర్మాణం పూర్తయితే వందలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కొడవటిపూడిలో మూడున్నర ఎకరాల్లో రూ.20 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే నేటివ్ అరకు కాఫీ తయారీ యూనిట్‌కు కూడా సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర

- జీసీసీ డివిజనల్ మేనేజర్ దేవరాజు



నిల్వలు తనిఖీ చేస్తున్న దేవరాజు

చింతపల్లి: కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే జీసీసీ ప్రధాన ఉద్దేశమని స్థానిక జీసీసీ డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు అన్నారు.బుధవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో అటవీ ఉత్పత్తుల నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ డౌనురులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ యూనిట్‌లో క్లీనింగ్, గ్రేడింగ్, డ్రైయింగ్, రోస్టరింగ్ జరుగుతుందన్నారు. ఈ ఏడాది కాఫీ రైతుకు గరిష్ట ధర అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

వైద్య సిబ్బంది సాహసం



రైవాడ జలాశయంలో నాటుపడవపై వలసలగరువు గ్రామానికి వెళుతున్న వైద్య సిబ్బంది



వలసలగరువు గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

పడవపై గిరిజన గ్రామానికి వెళ్లి వైద్యసేవలు

అనంతగిరి: మండలంలోని జీనబాడు పంచాయతీ వలసలగరువు గ్రామానికి వైద్యసిబ్బంది నాటు పడవపై వెళ్లి గిరిజనులకు సేవలందించారు. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. రైవాడ జలాశయం ఆనుకుని అవతలి ఒడ్డున ఉన్న ఆ ప్రాంతానికి చేరుకోవాలంటే నాటు పడవపై ప్రయాణించాలి. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించిన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో జీనబాడు సచివాలయ ఏఎన్ఎం పుష్ప, ఎంఎల్‌పీహెచ్‌పీ తులసి, సిబ్బంది రామరాజు సాహసించి నాటు పడవపై గ్రామానికి వెళ్లారు. సుమారు గంటపాటు ప్రయాణించి వలసలగరువు చేరుకున్నారు. అక్కడ రక్తం, షుగర్ పరీక్షలు నిర్వహించి గిరిజనులకు మందులు పంపిణీ చేశారు. ఈనెల 19న జీనబాడులో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. గ్రామ వలంటీర్ శివ, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ రైతులకు 150 రోజుల పని

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలోని 1.10 లక్షల మంది ఆర్‌వోఎఫ్‌ఆర్ రైతులకు 150 రోజుల పని దినాలు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలు నుంచి 22 మండలాల ఎంపీడీవోలు, ఉపాధిహామీ అధికారులతో బుధవారం వీడియో సమావేశం నిర్వహించారు. జాబ్‌కార్డులు జారీ, సచివాలయం సిబ్బంది హాజరు, జనన మరణ ధ్రువీకరణపత్రాల జారీ, ఆధార్ శిబిరాల నిర్వహణ, ఇంటిపన్ను వసూళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనుల కల్పనలో అలసత్వం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంతమంది ఆర్‌వోఎఫ్‌ఆర్ రైతులకు ఉపాధి పనులు కల్పిస్తున్నారని ఎంపీడీవోల నుంచి తెలుసుకున్నారు. పెద్ద ఎత్తున పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపిస్తే పరిపాలన పరమైన ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. ఉద్యానవనతోటలకు సంబంధించిన బిల్లులను త్వరితగతిన వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే బిల్లులు విడుదలవుతాయన్నారు. బిల్లులు చెల్లింపులకు సత్వర చర్యలు చేపట్టాలని ఈ విషయంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఉపాధి కూలీల ఆధార్ అథెంటికేషన్ చేయాలని సపష్టం చేశారు. 18వేల జనన ధ్రువీకరణపత్రాలు మంజూరు చేశామని, వాటిని లబ్ధిదారులకు పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

మరో 9462 మందికి జనన ధ్రువీకరణ పత్రాలు జారీకి అవసరమైన చర్యలను పంచాయతీ కార్యదర్శులు చేపట్టాలని చెప్పారు. ఇంటి పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. అక్రమ నిర్మాణాలు జరిగితే వాటికి విద్యుత్, నీటి సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్. కుమార్, ఉపాధిహామీ ఏపీడీ జె.గిరిబాబు, డీబీటీ మేనేజర్ నరేష్, 22 మండలాల ఎంపీడీవోలు, ఉపాధిహామీ ఏపీడీలు, ఏపీవోలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సెక్యూరిటీ గార్డు మృతి

మోతుగూడెం: విద్యుదాఘాతంతో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. స్థానిక ఏపీ జెన్‌కో కాలనీలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోపాలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జెన్‌కో కాలనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న గెడ్డం రమేష్ (42) నివాసం ఉంటున్న ఇంటి(క్వార్టర్)లోంచి బుధవారం ఉదయం దట్టంగా పొగలు వచ్చాయి. అదే కాలనీలో ఉంటున్న వారు వెంటనే జెన్‌కో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్‌తో పాటు ఇతర అధికారులు వెంటనే రమేష్ ఇంటి వద్దకు చేరుకున్నారు. తలుపులు తెరిచి చూసేసరికి రమేష్ అప్పటికే విగత జీవిగా ఉన్నాడు. వెంటనే సమాచారాన్ని తమకు తెలియజేశారని ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా విద్యుత్ షాక్‌కు గురైనట్టు ప్రాథమికంగా గుర్తించామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.



రమేష్ మృతదేహం

హోంగార్డు కోటేశ్వరరావు సేవలు ప్రశంసనీయం

- పదవీ విరమణ చేసిన హోంగార్డుకు చెక్కు అందించిన ఎస్పీ



హోంగార్డు కోటేశ్వరరావుకు చెక్కు అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: జిల్లాలోని సబ్బవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించి, పదవీ విరమణ పొందిన కె.కోటేశ్వరరావు సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం కోటేశ్వరరావు కుటుంబానికి, అనకాపల్లి జిల్లాతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పని చేస్తున్న హోంగార్డులు సేకరించిన ఒకరోజు వేతనం రూ.3,86,950 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ మరణించిన, పదవీ విరమణ చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు సహచర హోంగార్డులు స్వచ్ఛందంగా ముందుకు రావడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు(పరిపాలన) ఎస్పీ బి.విజయభాస్కర్, జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలన అధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు.



పేదల ఆరోగ్యానికి రక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో నిర్వహించిన ఆరోగ్య సమాచారాన్ని సేకరించిన సిబ్బంది వారికి వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేలా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 9లో

క్లుప్తంగా

మంత్రి రజినీకి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అభినందనలు



మంత్రి విడదల రజినీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు

సాక్షి,పాడేరు: అరకులోయ పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీని, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి.నరసింగరావు దంపతులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రైల్వే అతిథి గృహంలో మంత్రికి ఎమ్మెల్యే దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

సాక్షి, పాడేరు: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యరంగాల్లో ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు స్వీకరిస్తున్న దరఖాస్తులకు సంబంధించి ఈనెల పదో తేదీ వరకు పొడిగించామని స్థానిక ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తినైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 11 మండలాలకు చెందిన నిరుద్యోగ గిరి యువత సంబంధిత మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 10వతేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. టైలరింగ్, నిర్మాణరంగం, పర్యాటక, ఆతిథ్యరంగం, ప్లంబింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్, ఆటోమెటివ్, సెక్యూరిటీ గార్డు, తాపీ పనికి సంబంధించి శిక్షణ అందిస్తారని చెప్పారు. ఆసక్తి గల గిరిజన యువత అభ్యర్థి పూర్తి వివరాలతో మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని ఆయన కోరారు.

పాడి రైతులకూ యాంత్రీకరణ అండ

- ప్రతి మండల కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్
- తొలి దశలో అనకాపల్లి, గొలుగొండ మండలాల్లో సీహెచ్‌సీలు
- రెండో దశలో 15 మండలాల్లో ఏర్పాటుకు పశుసంవర్ధకశాఖ ప్రణాళిక



తుమ్మపాలలో రైతులకు అందజేసిన గడ్డి కోసే యంత్రాలు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో పాడి రైతులకు యాంత్రీకరణను అందుబాటులోకి తెచ్చేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే సాగు చేసుకునే రైతులకు ఆర్బీకేల ద్వారా యంత్ర పనిముట్లను అద్దెకు అందజేస్తున్నారు. కొనుగోలు చేసుకునేవారికి సబ్సిడీ ఇస్తున్నారు. అదే విధంగా పాడి రైతులకు కూడా అద్దె యంత్రాలను అందజేసేందుకు దశల వారీగా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గతేడాది తొలి దశలో అనకాపల్లి, గొలుగొండ మండలాల పరిధిలో రూ.14.70 లక్షల ఖరీదుతో పాడి రైతులకు ఉపయోగపడే యంత్రా అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామం, గొలుగొండ మండలంలో కొత్త మల్లంపేట గ్రామాల్లో కస్టమర్ హైరింగ్ కేంద్రాలు (సీహెచ్‌సీలు) ఏర్పాటు చేశారు. వీటిలో పాడి రైతులకు ఉపయోగపడే గడ్డి కత్తిరింపు యంత్రాలు, పాలు పితికే యంత్రాలు, దాణా తయారీ యంత్రాలు, ఎండు గడ్డి టైలింగ్ మిషన్లు, ఆవుపేడతో దుంగల తయారీ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.



యంత్ర వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీహెచ్‌సీ ద్వారా ఈ యంత్రాలను పాడి రైతులకు అద్దెకు ఇస్తున్నారు. 24 గంటలపాటు ఎంత..? గంటకు ఎంత అద్దె అనేది కస్టమర్ హైరింగ్ కేంద్రాల్లో డిస్‌ప్లే చేస్తున్నారు. ఆ ప్రాంత పశుసంవర్ధకశాఖ అధికారి ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షిస్తారు. ఎవరైనా పాడి రైతులు యంత్రాలు, పరికరాలను కొనుగోలు చేసుకోవాలని భావిస్తే అందుకు తగిన వెసులుబాటు, రాయితీలు కూడా కల్పిస్తారు.

జిల్లాలో పాడిరైతుల వివరాలు..	
పశుపోషణ చేపడుతున్న కుటుంబాలు	2.34 లక్షలు
ఆవులు	1.85 లక్షలు
గేదెలు	2.5 లక్షలు
గొర్రెలు	1.61 లక్షలు
మేకలు	1.81 లక్షలు

త్వరలో ప్రతి మండలంలో ఏర్పాటు

తొలి దశలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో రైతులు యంత్రాలను అద్దెకు తీసుకునేందుకు ఎక్కువగా మక్కువ చూపడంతో అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు పశుసంవర్ధకశాఖ సన్నహాలు చేస్తోంది. రెండో దశలో 15 సీహెచ్‌సీ కేంద్రాలను, మూడో దశలో పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు పశుసంవర్ధకశాఖ సన్నాహాలు చేస్తోంది.

రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా..

ఈ కస్టమర్ హైరింగ్ సెంటర్లు రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా పని చేయనున్నాయి. రైతులకు ఈ కేంద్రాలు కేంద్ర బిందువుగా ఉంటాయి గనుక హైరింగ్ సెంటర్లను కూడా అవే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. అన్ని ప్రాంతాల్లో హైరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా ఇప్పటికే వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు కృషి చేస్తున్నాయి.

రోజుకు అద్దె వివరాలు ఇలా...

బ్రష్ కట్టర్ (2 హెచ్‌పీ రకం)	- రూ.800
చాఫ్ కట్టర్ (2 హెచ్‌పీ రకం)	- రూ.250
చాఫ్ కట్టర్ (1.5 హెచ్‌పీ రకం)	- రూ.200
కౌ డంగ్ (2హెచ్‌పీ రకం)	- రూ.250
మినీ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్	- రూ.300
ఎలక్ట్రికల్ పెస్ట్ (యూవీ 365)	- రూ.50
ట్రాక్టర్ పాడిస్ట్రీ బాలెర్	- రూ.6,000
బ్రష్ కట్టర్ (1.5 హెచ్‌పీ రకం)	- రూ.400

తక్కువ వ్యవధిలో ఎక్కువ పనిచేసేలా...



తుమ్మపాల హైరింగ్ సెంటర్‌లో రైతునేస్తం గ్రూప్, గొలుగొండ మండలం కొత్త మల్లంపేటలో తనస్వీ పేరిట రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి సేద్యానికి వినియోగించే యంత్రాలను అద్దెకు అందిస్తున్నాం. ఇప్పటికే తక్కువ అద్దెలతో ట్రాక్టర్ల వ్యవసాయ పనిముట్లను వ్యవసాయశాఖ అందిస్తోంది. పాడి రైతులకు యాంత్రీకరణ విధానాన్ని అలవాటు చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువగా పనిచేసుకోవడానికి, సహాయకులను కూడా వీలైనంత మేరకు తగ్గించుకునేందుకు వీలుగా ఉంటుంది. పాడి రైతులు ఈ యంత్రాలను అద్దెకు తీసుకోవడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించుకోవచ్చు.

–బి.ప్రసాద్‌రావు, పశు సంవర్ధక శాఖ అధికారి

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో అత్యవసరంగా నిలిపివేసిన రెండో యూనిట్‌లో బుధవారం రాత్రి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ నుంచి సరఫరా జరుగుతున్న విద్యుత్‌కు తగినంత డిమాండ్ లేని కారణంగా ఈ నెల 1న మధ్యాహ్నం రిజర్వ్ షట్‌డౌన్ చేశారు. మూడు రోజుల అనంతరం సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ రెండో యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించామని, ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని సంస్థ అధికార వర్గాలు వెల్లడించాయి.

గిరిజన మహిళ మృతికి కారణమైన వ్యక్తిపై చర్యలకు డిమాండ్

హుకుంపేట : పాటి భవాని అనే గిరిజన మహిళను మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుని వదిలేసిన సరసంగి కృష్ణారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలి సోదరి పుణ్యవతి డిమాండ్ చేశారు. పాటి భవానిని కృష్ణారావు అనే వ్యక్తి వివాహం చేసుకుని చోడవరంలో కాపురం పెట్టాడని, అయితే అతనికి అంతకు ముందే పెళ్లి అయి భార్య బాకురులో ఉందని తెలిపారు. మాయమాటలతో తన చెల్లిని మోసం చేసి పెళ్లి చేసుకుని బాధపెడుతున్నాడని గతంలో హుకుంపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. భవానితో నిత్యం గొడవలు పెట్టుకుని కృష్ణారావు తన మొదటి భార్య వద్ద బాకురులో ఉండిపోవడంతో మనస్థాపం, మానసిక వేదనతో భవాని (30) మృతి చెందిందని తెలిపారు. హుకుంపేట పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు నెలలైనా కృష్ణారావుపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే భవానీ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పాత రిపోర్టు వదిలేసి అప్పటికప్పుడు కొత్తగా ఆడవారితో ఫిర్యాదు పత్రం రాయించుకుని కేసు పెట్టి కృష్ణారావుపై కేసు నమోదు చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. భవానీని మోసం చేసిన కృష్ణారావు, నిర్లక్ష్యం చేసిన ఎస్‌ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గంగవరం : బాలింతలు, గర్భిణులు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని, పోషకాహారమే మహా ఆరోగ్య భాగ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. జడేరు గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్.లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోష్టకాహార శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. జెడ్పీటీసీ బేబీరత్నం, ఎంఎంఎస్ అధ్యక్షరాలు పావని, సర్పంచ్‌లు మల్లికార్జున, రామలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

సెలవుల్లో కాలేజీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

విశాఖ విద్య: బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే ఉపేక్షించేది లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం హెచ్చరించార. 'బాలల హక్కుల పరిరక్షణలో ఇంటర్మీడియట్ కాలేజీల ప్రిన్సిపాల్స్ పాత్ర'అనే అంశంపై బుధవారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో ఏవీఎన్ కాలేజీలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జి.సీతారాం మాట్లాడుతూ ఐఐటీ, జేఈఈ అనే భ్రమలను కల్పించి, నగరంలోని కొన్ని కార్పొరేట్ కాలేజీలు విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయడం వారి హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో కాలేజీలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించడానికి వీల్లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కాలేజీల గుర్తింపు రద్దుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యార్థులకు నాణ్యమైన చదువులు చెప్పాలన్నారు. అధ్యాపకులు వృత్తి నైపుణ్యత పెంచుకోవాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాల బోధన చేయాలన్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించే కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏవీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు రమేష్, శ్రీలత, ఉమ్మడి విశాఖ జిల్లాలోని జూనియర్ కాలేజీలకు చెందిన సుమారు 200 మంది ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

29న యోగాసన పోటీలు

డాబాగార్డెన్స్ (విశాఖ): ఉత్తర కోస్తా జిల్లా స్థాయి యోగాసన పోటీలను ఈ నెల 29న ఆర్కే బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్ వేదికగా నిర్వహించనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కేఏ రాజు(యోగా రాజు) తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా 10 గ్రూపులుగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 8 ఏళ్ల నుంచి 50 ఏళ్లు పైబడిన యోగసాధకులు వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొనవచ్చని తెలియజేశారు. ఆసక్తి గలవారు ఈ నెల 20లోగా ప్రెసిడెంట్, 14-1-36, దసపల్లా హిల్స్, మహారాణిపేట(పోస్ట్), విశాఖపట్నం చిరునామాలో నేరుగా సంప్రదించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 98669 61122, 98482 15863 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకట రమేష్, ప్రొఫెసర్ భానుకుమార్, రమణమూర్తి పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: గ్రామ సచివలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కురిడిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇళ్లవద్దకు గ్రామ వలంటీర్లు అందిస్తున్నారన్నారు. మిగతా గ్రామాల్లోనూ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, మండల పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు శాంతి, సర్పంచ్‌లు లచ్చు, శారద, సుబ్బారావు, ఎంపీటీసీలు వరహాలమ్మ, విజయ, బీసీ సెల్ అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.



కురిడిలో నూతన భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత



కొత్తాడ కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న రేంజ్ ఆఫీసర్ కరుణాకర్



రాజవొమ్మంగిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రేంజ్ అధికారి అబ్బాయిదొర

గంగవరం : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత, కొత్తాడ కేజీబీవీలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జంతు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఫోక్స్‌పేట రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పర్యావరణ సంరక్షకులుగా పరిణితి చెందాలన్నారు. జంతువుల సంరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.హెచ్ఎంలు ఝాన్సీహేన్సన్, పద్మావతి, ఉమాదేవి, అటవీశాఖ డీఆర్‌ఓ సుజాత, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు నూకరాజుదొర, మనోహర్, అప్పారావు, పద్మ, మాణిక్యం, అరుణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: అడవులు, జీవవైవిధ్యాన్ని కాపాడుకొందాం... వన్య ప్రాణులను రక్షిద్దాం అని రాజవొమ్మంగి అటవీక్షేత్రాధికారి అబ్బాయిదొర అన్నారు. వైల్డ్ లైఫ్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులకు వన్యప్రాణులు, జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మూగ జీవాలను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వాటిని ఎవరైనా వేటాడితే చట్టపరంగా కఠినమైన శిక్షలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాల నేపథ్యంలో గురు, శుక్ర వారాల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఎఫ్ఎస్ఓ రాము, ఎఫ్‌బీఓ ప్రసాద్, నాగేశ్వరరావు, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

రంపచోడవరం : ఫోక్స్‌పేట ఫారెస్టు రెంజ ఆఫీసర్ కరుణాకర్ ఆధ్వర్యంలో మండలంలో ఎర్రంపాలెం, నల్లగొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ జంతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు.

పశువులు, మేకల మందపై దూసుకెళ్లిన టిప్పర్



మృత్యువాత పడిన మేకలు, పశువులు



ప్రమాదానికి కారణమైన టిప్పర్

- 9 పశువులు, 7 మేకలు అక్కడికక్కడే మృతి
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గూడెంకొత్తవీధి : ఇసుకలోడుతో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పదుల సంఖ్యలో మూగ జీవాలు బలైపోయాయి. చాపగెడ్డ మలుపు వద్ద కుమారవీధికి చెందిన పశువులను బుధవారం రోడ్డుకు ఒకవైపున మేత కోసం తీసుకెళ్తున్నారు. అదే సమయంలో మైదాన ప్రాంతం నుంచి ఆర్వీ నగర్‌కు రెండు టిప్పర్లు ఇసుక లోడుతో వస్తున్నాయి. వాటిలో ఒక టిప్పర్ మేకలు, పశువుల మందపైకి దూసుకెళ్లడంతో పాంగిపదునోకు చెందిన ఏడు పశువులు, గొల్లూరి హరిబాబుకు చెందిన రెండు పశువులు, కొర్రా చంద్రరావుకు చెందిన నాలుగు మేకలు, గొల్లూరి బిసినెస్, అర్జున్, పాంగి భగవాన్‌కు చెందిన ఒక్కో మేక మృతి చెందాయి. బ్రేకులు ఫెయిల్ కావడంతో పాటు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పశువులు, మేకలు చనిపోయాయని బాధిత రైతులు వాపోయారు. టిప్పర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ అప్పల సూరిని కోరారు. ఎస్ఐ ప్రమాద స్థలాన్ని సందర్శించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రింతాడ సంచార పశువైద్యశాఖ వైద్యులు అరుణ ఘటన స్థలానికి వెళ్లి పశువులకు వైద్య సేవలు అందించారు.

జి20లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది

వై.రామవరం: తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో గతనెల 30న నిర్వహించిన జి20 పోటీల్లో మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అక్కడ అందజేశారన్నారు. విద్యార్థినులు జి.సత్యగౌరి, కె.మల్లేశ్వరిదేవి, పి. ప్రియాంకదేవి, కె. స్వర్ణలత, పి. లోకేశ్వరి దివ్యకళ వచ్చేనెలలో నిర్వహించే దేశవ్యాప్తంగా నిర్వహించే జి20 కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయనతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

యువశక్తే దేశ సంపద

గాజువాక (విశాఖ) : భారతదేశానికి యువత అద్భుత శక్తి అని స్వామి గీతా సారనంద మహరాజ్ అన్నారు. వివేకానంద ఆలోచనలు, యువత అంశంపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచదేశాల్లో భారతదేశ యువత ప్రత్యేకతను కలిగి ఉంటారన్నారు. యువత తాము అనుకున్న లక్ష్యాలను సాధించడానికి అహర్నిశలు శ్రమించాలని, క్రమశిక్షణతో దేనినైనా సాధించవచ్చని అన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రామారావు, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ) : ఇటీవల వాల్తేర్ డివిజన్, కొత్తవలస – కిరండూల్ (కేకే) లైన్, మనబార్ – జరాటి స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో ఇంకా పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

- ఈ నెల 4, 5న భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్ – జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్ – భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్‌గా జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన రైలు ఈ నెల 5, 6న కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది.
- ఈ నెల 4, 5న విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్ – విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్‌గా కిరండూల్‌లో బయల్దేరాల్సిన రైలు ఈ నెల 5, 6న కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- ఈ నెల 5, 6న విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ 5, 6న అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- ఈ నెల 4, 5న హౌరాలో బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్ – హౌరా (18006) ఎక్స్‌ప్రెస్‌గా 5, 6న జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన రైలు టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.